సాక్షి
ఒడిశా
శుక్రవారం । 29 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,04,708లు, బంగారం 70 మిల్లీగ్రాములు , వెండి 7 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వేడుకగా నువాఖాయి

నువాఖాయి పండగను గవర్నర్ దంపతులు వేడుకగా జరుపుకున్నారు. ఇది చాలా ప్రత్యేకమన్నారు.

- 8లో



గణాధీశాయ ధీమహి

వినాయక నవరాత్రులు వైభవంగా మొదలయ్యాయి. పలు రూపాల గణనాథులు కొలువుదీరారు.

- 8లో

న్యూస్‌రీల్

జంఝావతిలో బాలుడి గల్లంతు

రాయగడ: స్థానిక సిరిగుడ సమీపంలోని జంఝావతి నదిలో తొమ్మిదేళ్ల బాలుడు గల్లంతయ్యాడు. బుధవారం సిరిగుడ గ్రామానికి చెందిన రోహన్ బిడిక అనే బాలుడు తన స్నేహితులతో కలిసి మధ్యాహ్నం జంఝావతి నదికి స్నానానికి వెళ్లాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నదిలోకి దిగిన బాలుడు ప్రవాహంలో కొట్టుకుపోయాడు. దీంతో తోటి స్నేహితులు గ్రామంలోకి వెళ్లి తెలియజేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి గ్రామస్తులు సమాచారం అందించారు. గంటల తరబడి వెతికినప్పటికీ బాలుడి ఆచూకి కనిపించలేదు.

కుప్పకూలిన రైల్వే ప్లాట్‌ఫారం



రైల్వేస్టేషన్‌లో కుప్పకూలిన ప్లాట్‌ఫారం

భువనేశ్వర్: కటక్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై పాత గోడ కూలిపోయింది. స్టేషన్ పునరాభివృద్ధి నిర్మాణ కార్యకలాపాలు జరుగుతుండగా 1 మరియు 2 నంబర్ల ప్లాట్‌ఫారాలపై గోడ కూలింది. దీంతో రైళ్ల రాకపోకలకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో ఎటువంటి గాయాలు లేదా ప్రాణనష్టం సంభవించలేదని తూర్పు కోస్తా రైల్వే అధికారులు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు ముగించి, ముప్పావు గంటలో రైలు రవాణా పునరుద్ధరించారు. ఈ ఘటనతో నిర్మాణ పనుల్లో భద్రతా లోపం ప్రశ్నార్థకమైంది.

శ్రీ మందిరంలో రహస్య కెమెరా



రహస్య కెమెరా కళ్లజోడు

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో తరచు రహస్య కెమెరాతో లోపలి దృశ్యాల చిత్రీకరణ కలకలం రేపుతోంది. ఈ కెమెరా కళ్లజోడుకు అమరి ఉంటుంది. స్వామి దర్శనం కోసం శ్రీ మందిరం లోపలి ప్రాకారానికి చేరిన భక్తులు అక్కడి దృశ్యాల్ని రికార్డు చేస్తున్నారు. తాజాగా అరూప్ రాయ్ అనే వ్యక్తి ఈ చర్యకు పాల్పడుతుండగా ఆలయ పోలీసులు (జేటీపీ) దృష్టిలో పడ్డాడు. తక్షణమే అదుపులోకి తీసుకుని నిందితునికి శ్రీ మందిరం ఠాణా పోలీసులకు అప్పగించారు. నిందితుని విచారణ కొనసాగుతుంది.

గోమాత సంరక్షణ సందేశం



బాల గణపతి వేషధారణలో గోమాతకు దాణా అందజేస్తున్న బాల గణపతి

భువనేశ్వర్: గణపతి ఉత్సవాల్లో భాగంగా జీవే దయ ఫౌండేషన్ గోమాత సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. గణపతి వేషధారణలో బాలునితో రహదారులపై ఉన్న పాడి పశువులకు దాణా అందజేసే కార్యక్రమం చేపట్టి అందరి దృష్టిని ఆకట్టుకుంది. కటక్, భువనేశ్వర్ జంట నగరాల రహదారుల పరిసరాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు.

విద్యార్థికి గాయాలు



ఇనుప ఊచ తొలగిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని పాత గుణుపూర్ ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న గిరిధార్ సాబొరాకు తీవ్రగాయాలయ్యాయి. వినాయక చవితి పురస్కరించుకొని పాఠశాలకు వెళ్లిన సాబొరా పూజా కార్యక్రమాల అనంతరం పాఠశాల మేడపైకి వెళ్లాడు. మేడ మీద నుంచి ప్రమాదవశాత్తు కిందకి జారిపడడంతో పాఠశాల మెయిన్ గేటుకు ఉన్న ఇనుప ఊచ కాలికి గుచ్చుకుంది. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు తెలుసుకుని గుణుపూర్ ఆస్పత్రికి సమాచారం అందించారు. అక్కడికు చేరుకున్న వైద్యులు, సిబ్బంది విద్యార్థికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి, గుచ్చుకుపోయిన ఇనుప ఊచను తొలగించారు. అనంతరం ఆస్పత్రికి తరలించి వైద్యమందించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.

రాష్ట్ర రైతులకు.. నువాఖాయ్ కానుక

- రైతులకు సీఎం–కిసాన్ యోజన కింద రూ. 1,04,129 కోట్లు పంపిణీ

భువనేశ్వర్: పవిత్ర నువాఖాయ్ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర రైతాంగానికి భారీ కానుక అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారత శాఖ ఆధ్వర్యంలో 2025–26 రబీ సాగు కోసం సీఎం కిసాన్ సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఓయూటీ కృషి శిక్షా సదన్ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మూడవ విడత కింద 51 లక్షల 54 వేల 115 మంది చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని రైతు కుటుంబాలు, షెడ్యూల్డ్ తెగలు, పట్టణ రైతులకు ప్రత్యక్ష లబ్ధి బదిలీ (డీబీటీ) ద్వారా సమగ్రంగా రూ. 1,04,129 కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయంలో సుమారు రూ. 59 కోట్ల వ్యయంతో నిర్మించిన కృషక్ భవన్, కృషి శిక్షా సదన్ ప్రాంగణంలో రిసెప్షన్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సంవత్సరం కిసాన్ సమృద్ధి యోజన కింద ఇప్పటికే 18 లక్షలకు పైగా రైతులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అన్నదాతల అభివృద్ధితో రాష్ట్ర పురోగతి ముడి పడి ఉంది. చిన్న, సన్నకారు రైతులకు ప్రతి పంట (రబీ మరియు ఖరీఫ్) సీజన్‌కు రూ. 2000 చొప్పున ఏటా రూ. 4000 అందజేస్తున్నారు. భూమిలేని రైతు కుటుంబాలకు మేక, కోడి, బాతుల పెంపకంతో పాటు ఉద్యానవనం, తేనెటీగల పెంపకం, ఇతర అనుబంధ వ్యవసాయ కార్యకలాపాల కోసం మూడు విడతల కింద సమగ్రంగా రూ. 12,500 ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తున్నారు. పంటలను రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అనేక రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మారుతున్న వాతావరణం, ఆలస్యమైన రుతుపవనాల నేపథ్యంలో పంట దిగుబడిని నిర్ధారించడానికి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పంట వైవిధ్యీకరణ వంటి పథకాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఒడిశాలోని ప్రధాన కూరగాయల పంటలలో బంగాళా దుంప ఉత్పత్తిలో రాష్ట్రాన్ని స్వయం సమృద్ధిగా మలిచేందుకు రాష్ట్రంలోని 3,115 క్లస్టర్లలో 36,000 పైబడిన రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 1 లక్ష మంది లబ్ధిదారులు బంగాళాదుంప సాగులో మెలకువలు తెలుసుకున్నారు. గత సంవత్సరం, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు 1,60,874 క్వింటాళ్ల సర్టిఫైడ్ సీడ్ బంగాళాదుంపలను పంపిణీ చేశారు, ఇది మునుపటి సంవత్సరం కంటే 3 రెట్లు ఎక్కువగా పేర్కొన్నారు. రాష్ట్రంలో శీతల గిడ్డంగుల ఏర్పాటుకు ఆర్థిక సహాయ పథకం ఈ ఏడాది జనవరి నెలలో అమలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఉప–జిల్లా స్థాయిలో ప్రైవేట్ భాగస్వామ్యంలో ఒక్కో శీతల గిడ్డంగి ఏర్పాటు చేస్తారు. ఈ చర్యతో పంటకోత తర్వాత నష్టాలను నివారించడం, వ్యవసాయ ఉత్పత్తులకు సరసమైన ధరలతో మార్కెట్ సౌకర్యాలను అందించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు సాధ్యం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1,406 వ్యవసాయ ప్రాజెక్టులకు రూ. 188 కోట్ల 34 లక్షల సబ్సిడీ మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. రైతు కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్యాభ్యాసానికి కృషి విద్యా నిధి యోజన కింద సీఎం కిసాన్ లబ్ధిదారుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేస్తున్నారు.

ఈ స్కాలర్‌షిప్‌ను వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయం, నర్సింగ్, ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎంలు మరియు ఎ.సి.ఆర్ వంటి ప్రముఖ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా దోహదపడుతుంది. గత విద్యా సంవత్సరంలో 13,923 మంది సీఎం కిసాన్ లబ్ధిదారులకు వివిధ సాంకేతిక కోర్సుల కోసం దాదాపు రూ. 53 కోట్ల 69 లక్షల కృషి విద్యా నిధి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్, మత్స్య, పశుసంవర్ధక అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద్ మల్లిక్, భువనేశ్వర్ (ఏకామ్రా) ఎమ్మెల్యే బాబూ సింగ్, మత్స్య మరియు పశుసంవర్ధక అభివద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్ కుమార్ వశిష్ఠ, ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రభాత్ కుమార్ రౌల్, వ్యవసాయ, రైతు సాధికారత శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి, ఆ శాఖకు చెందిన అనేక మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 600 మందికి పైగా రైతులు, ఓయూఏటీకి చెందిన 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాలుపంచుకున్నారు.



సీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి



కృషక్ భవన్ ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



సీఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగం

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం



మృతుడు బిశ్వాల్ తండి



నుజ్జునుజ్జయిన బైకు

రాయగడ:

సదరు సమితి జఫాకొల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలవ్వగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడు జిల్లాలోని టికిరికి చెందిన బిశ్వాల్ తండి (42)గా గుర్తించారు. అలాగే గాయాలైన వ్యక్తి అక్షయ సిమిలిగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, గాయాలైన వ్యక్తిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం టికిరి నుంచి బైక్‌పై రాయగడకు వచ్చిన బిశ్వాల్, సిమిలిలు, పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో రాయగడకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలోని జఫాకొల వద్ద ఎదురుగా సిమ్మెంటు మెటల్ లోడ్‌తో వస్తున్న లారీని అదుపుతప్పి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకు నుజ్జునుజ్జవ్వగా బైకును నడుపుతున్న బిశ్వాల్ కొంతదూరం ఎగిరి పొదల్లో పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తోరణ చైతన్యం

భువనేశ్వర్: విఘ్నేశ్వరుని పూజలు పురస్కరించుకుని నగరంలో పలు చోట్ల నిలువెత్తు తోరణాలు వెలిశాయి. స్థానిక నాల్కో నగర్ ప్రాంతంలో వెలసిన ఈ తోరణం రాష్ట్రంలో ఇటీవల తీవ్ర కలకలం రేపిన మహిళల పట్ల నేరాల్ని ప్రతిబింబించే చిత్రావళితో నిలువెత్తున తీర్చిదిద్దారు. ఈ తోరణం మహిళలపై జరిగే దారుణాల మధ్య స్త్రీ నిస్సహాయత, భ్రూణ హత్యలు, మహిళా వర్గంలో తలెత్తుతున్న పలు సామాజిక సమస్యల్ని ప్రదర్శించారు.



మహిళల పట్ల నేరాల ప్రతిబింబంతో పూజా పందిరి

శ్రీ మందిరం శిఖరంపై డ్రోన్ చక్కర్లు



శ్రీ మందిరం శిఖరంపై చక్కర్లు కొడుతున్న డ్రోన్ వీడియోలో ఓ చిత్రం

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరం శిఖరంపై డ్రోన్ సంచలనం వివాదాలు రేపుతోంది. బొడొ దండొ మార్కెట్ చౌరస్తా నుంచి శ్రీ మందిరం వరకు డ్రోన్ చక్కర్లు కొట్టిన దృశ్యంతో వీడియో ప్రసారం దుమారం రేపతుంది. ప్రధాన ఆలయ శిఖర ప్రాంగణం డోలమండపం మీదుగా ఎగిరి మార్కెట్ చౌరస్తా వైపు చక్కర్లు కొట్టినట్లు ఈ వీడియో స్పష్టం చేస్తోంది. ఈ సంఘటనపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. డ్రోన్ నిరోధక వ్యవస్థ ప్రవేశ పెట్టినట్లు స్వామి రథ యాత్ర పురస్కరించుకుని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ ప్రకటించిన విషయం తెలిసిందే. మరో వైపు శ్రీ మందిరం ప్రాంగణం నో ఫ్లై జోన్‌గా ప్రకటించిన పరిస్థితుల్లో తరచూ డ్రోన్ సంచారం శ్రీ మందిరం భద్రతా వ్యవస్థకు పెను సవాలుగా నిలుస్తోంది.

• వృక్షో రక్షతి రక్షితః



గణపతి పూజ పురస్కరించుకుని వృక్షో రక్షతి రక్షితః చైతన్య సందేశాన్ని ప్రచారం చేశారు. స్థానిక ఫారెస్టు పార్కు ప్రాంతంలో పచ్చని చెట్టును నిలువెత్తు గణపతిగా రూపుదిద్ది శాస్త్రోక్తంగా చవితి పూజ నిర్వహించారు.

- భువనేశ్వర్

యువకుడి దారుణ హత్య

రాయగడ: పాత కక్షలతో ఒక యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మృతుడు స్థానిక మహిళా కళాశాల వైనుక ఉన్న హరిజన వీధికి చెందిన రోహిత్ థప్ప(25)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపంలోని మైదానంలో ఉన్న రోహిత్‌పై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. అనంతరం అపస్మారక స్థితిలో ఉన్న రోహిత్‌ను వదిలి పారిపోయారు. తీవ్రగాయాలకు గురై రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న అతడిని అటువైపుగా వెళ్తున్న కొంతమంది చూసి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే తలకు బలమైన గాయమవ్వడంతో అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే పాత కక్షల కారణంగానే దుండగులు రోహిత్‌ను హతమార్చారని పోలీసులు భావిస్తున్నారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు



రైతన్నలకు ఆర్థిక సాయం

పర్లాకిమిడి: జిల్లాలోని రైతులకు నువాఖయి పండగ సందర్భంగా స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాల్‌లో పీఎం కిసాన్ ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఖనిజశాఖ మంత్రి బిభూతి జెన్నా ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కిసాన్ పథకమే ప్రధానమంత్రి కిసాన్ రైతు బంధు పథకంగా అమలు చేస్తున్నట్టు మంత్రి జెన్నా అన్నారు. కౌలు రైతులుకు, తక్కువ భూమి ఉన్న రైతన్నలకు 2025–26లో రూ.6 వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు నువాఖయి పండగ సందర్భంగా నేరుగా రైతుల అక్కౌంట్లలో వేస్తున్నామని మంత్రి అన్నారు. గజపతి జిల్లాలో మొత్తం 64,905 వేల మంది రైతులకు రూ.6 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నామని మంత్రి అన్నారు. గత ఏప్రిల్ నెలలో అక్షయ తృతీయ పండగ సందర్భంగా రూ.6 వేలను రైతన్నలకు వారి ఖాతాలకు అందజేశామని, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారిక మందుల కొనుగోలుకు ఉపయోగపడతాయన్నారు. తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, అదనపు కలెక్టర్ మునీంద్ర హానగ, ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా, ఏడీఎం ఫల్గుని మఝి, జిల్లా ముఖ్యవ్యవసాయ అధికారి రవీంద్ర కుమార్ హదక్, జిల్లా పరిషత్ సీడీఓ శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి జెన్నా, అధికారులు

'పాఠశాలల్లో కంటి పరీక్షలకు ప్రాథమిక సౌకర్యాలు అవసరం'

భువనేశ్వర్: నేత్ర, రక్త హీనత సమస్యల్ని ఉమ్మడి కృషితో నివారించాలని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపునిచ్చారు. పారిశ్రామిక, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, ఆర్థిక సంస్థలు, కంటి ఆస్పత్రులు, ప్రభుత్వ రంగ సంస్థలు ఈ రెండు ప్రధాన ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాజ్ భవన్‌లోని నూతన అభిషేక్ హాల్‌లో అంధత్వ నియంత్రణ, రక్తహీనత నిర్మూలనపై జరిగిన సమావేశానికి గవర్నర్ అధ్యక్షత వహించి ఈ విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక విద్యా శాఖ మంత్రి సంపద్ చంద్ర స్వంయి, వివిధ ప్రభుత్వ శాఖల సీనియర్ అధికారులు, పారిశ్రామిక సంఘాలు, వ్యాపారుల సంఘాలు, సామాజిక సంస్థలు, ఎన్‌జీఓలు, కంటి ఆస్పత్రులు, ఎన్‌సీసీ డైరెక్టరేట్, ఒడిశా రాష్ట్ర భారత్ స్కౌట్స్, గైడ్స్, ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ కంభంపాటి మాట్లాడుతూ 'ప్రధానంగా పాఠశాల పిల్లలలో దృష్టి సమస్యల పెరుగుదల, బాలికలు, మహిళల్లో దిగజారుతున్న హిమోగ్లోబిన్ స్థాయిలు ఆందోళన కలిగిస్తున్నాయి. చాలా మంది పాఠశాల పిల్లలు తమంతట తాముగా కంటి చూపు సమస్యలను గుర్తించలేకపోతున్నారు. సకాలంలో తగిన పరీక్షలు నిర్వహించకపోతే పరిస్థితి సంక్లిష్టమయ్యే అవకాశం ఉంటుంది. ప్రతి పాఠశాల విద్యార్థి కంటి చూపును కనీసం సంవత్సరానికి ఒకసారి పరీక్షించేలా చర్యలు చేపట్టాలి. విద్యకు ముందస్తుగా పిల్లల ఆరోగ్యం గుర్తించడం చాలా ముఖ్యం' అని అన్నారు. అన్ని పాఠశాలల్లో కంటి పరీక్షలకు ప్రాథమిక సౌకర్యాలు ఉండాలని గవర్నర్ సూచించారు. స్క్రీనింగ్ కోసం చిన్న, సరళమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని సాధారణ పరీక్షల కోసం ఉపయోగించడానికి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వవచ్చని గవర్నరు నొక్కి చెప్పారు. పాఠశాలల్లో ఇప్పటికే కంటి చూపు పరీక్షలు నిర్వహిస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు ఈ సమావేశంలో తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమానికి మద్దతు ఇవ్వడానికి అనేక సంస్థలు కూడా ముందుకు వచ్చాయి. రక్తహీనత సమస్యపై డాక్టర్ హరిబాబు కంభంపాటి మాట్లాడుతు బాలికలు, మహిళలకు అవగాహన కల్పించాల్సి ఉంది. మెరుగైన పోషకాహారం, క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీల అవసరంపై వారిని చైతన్యపరచాలన్నారు. బాలికలలో హిమోగ్లోబిన్ స్థాయిలను సహజంగా మెరుగుపరచడానికి రోజువారీ ఆహారంలో క్యారెట్, బీట్‌రూట్ రసం, బెల్లం చిక్కీ వంటి సాధారణ పదార్థాలను జోడించాలని ఆయన సిఫార్సు చేశారు. సమావేశంలో, రాష్ట్రంలో ఈ రెండు సమస్యల ప్రస్తుత స్థితిని గవర్నర్‌కు సవివరంగా ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలపై ఇప్పటికే అనేక పథకాలను అమలు చేస్తోందని కూడా గవర్నర్ గుర్తించారు. మెరుగైన ఫలితాలను పొందడానికి పరిశ్రమలు, సామాజిక సంస్థల అనుసంధానంతో ప్రభుత్వ కార్యక్రమాల అమలు పట్ల శ్రద్ధ వహించాలని, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శిని నోడల్ అధికారిగా వ్యవహరించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని గవర్నర్ కోరారు.



సమావేశానికి హాజరైన పలు వర్గాల ప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి

క్లుప్తంగా


రైలు ఢీకొని వృద్ధుడు మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రాపురం రైల్వే స్టేషన్ సమీపంలో బండిపేట వద్ద రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. తల చితికిపోయి గుర్తుపట్టనివిధంగా మారింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కోటబొమ్మాళి మండలం సరియా బొడ్డపాడు గ్రామానికి చెందిన చాప రాములు(67)గా గుర్తించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. ఆత్మహత్య అనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

రణస్థలం: రణస్థలం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బుడుమూరు శిరీష(22) అనే మహిళ మృతి చెందింది. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 10.15 గంటల సమయంలో సూర్య స్కూల్ జంక్షన్‌లో ఆటో మలుపు తిప్పుతుండగా డివైడర్‌ను ఢీకొట్టి ఆటో బోల్తాపడింది. అందులో కూర్చున్న శిరీష బయటకు తుళ్లిపడగానే విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినది. శిరీష తన భర్తతో గొడవల నేపథ్యంలో మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేద్దామని వచ్చింది. ఈ క్రమంలో జె.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో అమ్మమ్మ ఇంటి వద్ద మాట్లాడి తిరిగి స్వగ్రామం లావేరు మండలం పాతకుంకాం వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆటోలో ఉన్న మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై ఎస్.చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతి చెందిన ప్రభాస్

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు యువకుడు కేటీఎం బైక్‌పై జే.ఆర్.పురం థియేటర్ వైపు నుంచి సీతంవలస మీదుగా లావేరు వెళ్తుండగా శ్మశానం మలుపు వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో అదుపుతప్పి పడిపోయారు. బైక్ నడుపుతున్న వనుము ప్రభాస్(20) బైక్ ముందు పెట్రోల్ ట్యాంక్‌ను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రాంబాబు తుప్పల్లోకి తుళ్లిపోయి గాయాలతో బయటపడ్డాడు. మృతుడు ప్రభాస్‌ది లావేరు మండలం సుభద్రాపురం. తల్లిదండ్రులు చిట్టిబాబు, సత్యవతి, సోదరుడు ఉన్నాడు. గాయపడిన రాంబాబు స్వగ్రామం మురపాక. ఇద్దరూ గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై ఎస్.చిరంజీవి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిషింగ్ హార్బర్ స్థల పరిశీలన


ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐసీఈఎఫ్ బృందం

ఎచ్చెర్ల : బుడగట్లపాలెం సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని గురువారం సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్, ఇంజినీరింగ్ ఫర్ ఫిషరీ (సీఐసీఈఎఫ్) బెంగళూరు బృందం సాధారణ పరిశీలన చేపట్టింది. కాకినాడ వద్ద ఉప్పాడ ఫిషింగ్ హార్బర్‌ను తనిఖీకి వచ్చిన వీరు బుడగట్లపాలెం హార్బర్‌ను కూడా పరిశీలించారు. గతంలో చేసిన ప్రతిపాదనల్లో మార్పులు చేపడుతూ డబ్ల్యూ.ఏపీ.సీవోసీ పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఇక్కడ పనులకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు నూతన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో సీఐసీఈఎఫ్ డైరెక్టర్ ఎస్.రవిశంకర్, డాక్టర్ బెలియప్ప, ఏపీ మేరీ టైంబోర్డ్ ఎస్ఈ నగేష్, మత్స్యశాఖ డీడీ వై.సత్యనారాయణ, ఎఫ్‌డీవో రవికుమార్, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, ఎంఎఫ్‌సీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీరాములు, వైస్ ప్రెసిడెంట్ యు.అప్పన్న, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త హత్య కేసులో.. ముగ్గురికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : గతేడాది ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూన ప్రసాద్‌ను టీడీపీ మద్దతుదారులు దారి కాచి దాడిచేయడంతో మరణించిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో ఎచ్చెర్ల పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తొమ్మిది మందిని చేర్చి నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా మరో ముగ్గురు శీపాన శివకుమార్, కొత్తకోట సాయి, జమ్మి వేణులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ పేర్కొన్నారు.


రాయగడ: కొబ్బరికాయలతో రూపొందించిన వినాయకుడు


కొరాపుట్‌నబరంగ్‌పూర్ జిల్లా తుంబర్ల గ్రామంలో వినాయకుడు


భువనేశ్వర్: ప్రధాన పోస్టాఫీసు కూడలి మార్కెట్ సంఘం గణపతి ఉత్సవ తోరణం


భువనేశ్వర్: కటక్ చండీ మాత ఆలయ ప్రాంగణంలో గణపతి స్వర్ణాలంకారం


కొరాపుట్: పూజలందుకుంటున్న నందపూర్ పురాతన రాతి గణేష్ విగ్రహం

గణాధీశాయ ధీమహి


రాయగడ: తిరుమల తిరుపతి సెట్ మండపం

రాయగడ: వినాయక ఉత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక లారీ యజమానుల సంఘం తిరుమల తిరుపతి తరహా పెండాల్‌ను ఏర్పాటు చేశారు. అదేవిధంగా టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద జంగిల్ గాయ్స్ ఆధ్వర్యంలో గేట్‌వే ఆఫ్ ఇండియా పెండాల్, తుంబిగుడ వద్ద గోల్డెన్ టెంపుల్ తరహా ఏర్పాటు చేసిన పూజా పెండాళ్లు ఆకట్టుకుంటున్నాయి. బుదరావలసలో 2001 కొబ్బరి కాయలతో 25 అడుగుల వినాయకుడు ప్రత్యేకంగా నిలిచాడు. గాంధీనగర్ లో దశావతారాలతో పాటు క్షీరసాగరమధనంను తలపించే విధంగా కళ్లకు కట్టినట్లుగా వినాయక అవతారాలను ఏర్పాటు చేశారు.

జయపురం: కుండపోత వానలోనూ గణేష్ చవితి ఉత్సవాలు ఘనంగా జరిగింది. జయపురంలో పెద్ద పెద్ద పూజామండపాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల్లో అత్యధికం స్థానిక కళాకారులు తయారు చేసినవే కావడం గమనార్హం.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: గణేష్ చతుర్థి సందర్భంగా పర్లాకిమిడిలో పలు కూడళ్ల వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. రేఖానా వీధిలో బాలరాముడు, వినాయకుడు విగ్రహం చూపరులకు ఆకర్షిస్తోంది.

కొరాపుట్‌లో..

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో గణేష్ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. నవరాత్రులు తర్వాత గ్రహణం ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది ఉత్సవాలు తొమ్మిది రోజులకే ముగియాల్సిన పరిస్థితి ఏర్పడింది.


రాయగడ: గేట్ వే ఆఫ్ ఇండియా మండపం


జయపురం: రెండో మార్కెట్ జంక్షన్‌లో బాల బాలిక రూపాలలో వినాయకుడు, భార్య సిద్ధి


జయపురం: చౌడేశ్వరి ఆలయకూడలి వద్ద త్రిముఖ గణనాథుడు


పర్లాకిమిడి: సింకివీధిలో గణేశుడు


రాయగడ: శిలారూపంలో ప్రత్యేకంగా గణనాథుడి రూపం


జయపురం:పాఠశాలలో గణనాథుని పూజలలో పూజా హారతిని స్వీకరిస్తున్న విద్యార్థులు


జయపురం సిటీ స్కూలులో వినాయక పూజలలో విద్యార్థినులు


రాయగడ: క్షీరసాగర మధనం, దశావతారాల్లో వినాయకుడు



భువనేశ్వర్: జట్నీ బెంగాళీ క్లబ్ పూజా మండపం


సీతారామ ఛక్ పూజా మండపం ప్రవేశ తోరణం


భువనేశ్వర్: ప్రధాన పోస్టాఫీసు కూడలి మార్కెటు సంఘం గణపతి


భువనేశ్వర్: జట్నీ పోలీసు రాణా కూడలి గణపతి పూజా మండపం.

ఇనుపకుర్తి 'బిముగ్ధ సమ్మాన్'తో సత్కారం


ఇనుపకుర్తిని సన్మానిస్తున్న సీతాకాంత జెన్నా, చంద్రశేఖర హోత్తా

పర్లాకిమిడి: ప్రముఖ వాగ్గేయకారుడు, సెక్సోఫోన్‌లో ఏ-గ్రేడ్ సంపాదించిన పర్లాకిమిడి వాసి ఇనుపకుర్తి మన్మధరావుకు భువనేశ్వర్‌లో భంజమండపంలో బుధవారం 'బిముగ్ధ సమ్మాన్' అవార్డుతో ఒడిశా సంగీత నాటక అకాడమి, గజపతి జిల్లాకు చెందిన పదామృత నృత్యాయన సంస్థ తరఫున కార్యదర్శి చంద్రశేఖర హోత్తా సన్మానించారు. మన్మధరావుకు అవార్డు కింద నగదు బహుమతి రూ.5వేలు, తామ్రపత్రం, దుశ్శాలువతో సన్మానించినట్టు సంగీత దర్శకులు రఘునాథ పాత్రో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పదామృత నృత్యాయన అకాడమి అధ్యక్షుడు నృసింహా చరణ్ పట్నాయక్, శుభశ్రీ ముఖర్జీ, గురు ధనేశ్వర స్వయిం, సీతాకాంత జెన్నా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒడిస్సీ కళాకారులు ప్రీతిప్రియా, బింధుప్రియాలు నృత్యం చేసి పలువురిని అలరించారు.

నిందితులను అరెస్టు చేయాలి


ఫ్లై ఓవర్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

రాయగడ: స్థానిక మహిళా కళాశాల వెనుక నివసిస్తున్న రొహిత్ థప్ప హత్య కేసుకు సంబంధించిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబీకులు, బస్తీ వాసులు గురువారం ఆందోళన చేపట్టారు. సదరు పోలీస్ స్టేషన్‌ను ఘెరావ్ చేయడంతోపాటు ఫ్లై ఓవర్ వద్ద రాస్తారోకో చేశారు. బుధవారం రోహిత్ థప్ప అనే యువకుడిని కొందరు దుండగులు అగ్నిమాపక కేంద్ర కార్యాలయం వద్ద గల మైదానంలో దాడి చేసి హత్య చేశారు. ఈ హత్యకు కారకులైన వారిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బాధితులు ఆరోపించారు. రస్తారోకో కారణంగా వాహనాల రాకపోకలు సుమారు మూడు గంటల పాటు నిలిచిపోయాయి. పోలీసులు చొరవ తీసుకుని నిందితులను పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళనను విరమించారు.


ఆందోళనకారులను బుజ్జగిస్తున్న పోలీసులు

బీజేడీది మొసలి కన్నీరు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ్ సామంతరాయ్


గౌతమ్ సామంతరాయ్ తదితరులు

జయపురం: ఎరువుల సమస్యలపై రైతులు జరుపుతున్న ఆందోళనను సమర్థిస్తూ బీజేడీ మొసలి కన్నీరు కారుస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ్ సామంతరాయ్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో రైతులకు ఎరువులు అందజేస్తామని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందేనని, అయినా బీజేడీ కుత్రిమ ఆందోళన చేపడుతుందని దుయ్యబట్టారు. రైతులకు ఎరువులు వెంటనే సమకూర్చాలని బీజేడీ నేతలు, ఆ పార్టీ శ్రేణులు ఇటీవల జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని ఘెరావ్ చేయటాన్ని తప్పుబట్టారు. బీజేడీ పాలనలో చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవటానికే ఎరువుల డ్రామా ఆడుతుందన్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని, ఈ విషయం రైతులు అర్థం చేసుకోవాలని సామంతరాయ్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

వంతెనకు అడ్డంగా పడిన చెట్టు


చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు

పర్లాకిమిడి: గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కాశీనగర్ సమితి బి.సీతాపురం పంచాయతీ దేవుడళ గ్రామంలో వంతెనకు అడ్డంగా చెట్టుపడింది. దీంతో గుణుపురం పర్లాకిమిడి మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. సర్పంచ్ కె.తేజ, యువకులు దిలీప్, ప్రణయమిశాల్ తదితరులు పాల్గొని వంతెనకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు.

వేడుకగా నువా ఖాయి


సమలేశ్వరి మాతకు నవాన్న నివేదించిన గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: రాష్ట్ర వ్యవసాయ ప్రాధాన్య పండగ నువా ఖాయి వేడుకని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి దంపతులు గురువారం రాజ్‌భవన్‌లో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ ఒడిశా ఆరాధ్య దైవం సమలేశ్వరి దేవికి ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. నువా ఖాయి పురస్కరించుకుని సమలేశ్వరి మాతకు ఈ సీజను సాగు తొలి పంట బియ్యం నవాన్నంగా సమర్పించడం ఆచారం. ఆచారం ప్రకారం పూర్తి స్థానిక సంప్రదాయాలతో నవాన్న నివేదన పూజాదుల్లో గవర్నరుతో ఆయన సతీమణి జయశ్రీ కంభంపాటి భక్తి శ్రద్ధలతో పాలుపంచుకున్నారు. పూజాదులు ముగిసిన తర్వాత గవర్నర్ రాజ్ భవన్ అధికారులు, సిబ్బందికి ప్రసాదం పంపిణీ చేశారు.

గవర్నర్ కమిషనర్, కార్యదర్శి రూపా రోషన్ సాహు తదితర రాజ్ భవన్ అధికారులు, సిబ్బంది ఈ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నువా ఖాయి కృతజ్ఞతపూర్వక వేడుకగా పేర్కొన్నారు. రైతాంగం, ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చే ఈ సంప్రదాయాన్ని అందరితో కలిసి మెలిసి జరుపుకోవడంపై గవర్నర్ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ శుభ సందర్భంగా ఒడిశా ప్రజలందరికీ శ్రేయస్సు, ఆనందం, ఉన్నత ఆరోగ్యం సిద్ధించాలని గవర్నర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం


అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్ష నేతలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యుత్ పోరాటంలో అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. 2000లో చంద్రబాబు నాయుడు తెచ్చిన విద్యుత్ సంస్కరణకు వ్యతిరేకంగా విద్యుత్ పెంపుదలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బషీర్‌బాగ్ కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామికి గురువారం నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం శ్రీకాకుళం అంబేద్కర్ జంక్షన్ వద్ద నిర్వహించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని నినాదాలు చేశారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఎం నాయకులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, ఆర్.ప్రకాష్‌రావు, ఎం.గోపి, కె.సూరయ్య, పాణి గ్రహి, ఎం.లక్ష్మి, శ్రీదేవి, డి.గణేష్, ఎస్.కృష్ణవేణి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గర్భిణి మృతిపై విచారణ



ఆస్పత్రిలో సిబ్బందిని విచారణ చేస్తున్న డీసీహెచ్ఎస్ నాగభూషణరావు

పాలకొండ: స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం గర్భిణీ మృతి చెందడంపై డీసీహెచ్ఎస్ నాగభూషణ్ గురువారం విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్ చిరంజీవి అందించిన వివరాల మేరకు మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన బొమ్మాళి పద్మ మూడవ కాన్పు కోసం ఏరియా ఆస్పత్రిలో ఉదయం 9గంటలకు ఆసుపత్రిలో చేరింది. అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను అక్కడ ఉన్న సిబ్బంది పరిశీలించారు. ఇంతలో ఆమె ఆస్పత్రిలో ఉదయం 11 గంటల సమయంలో మరణించింది. అప్పటికే విధుల్లో ఉండాల్సిన వైద్యులు లేక పోవడంతోనే పద్మ మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. అనంతరం గ్రామ పెద్దలు సర్ది చెప్పడంతో మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై ఫిర్యాదు రావడంతో డీసీహెచ్ఎస్ ఏరియా ఆస్పత్రిని సందర్శించి విచారణ చేపట్టారు. గ్రామంలోని ఆశవర్కర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీల నుంచి వివరాలు తీసుకున్నారు. రక్తస్రావం ఎక్కువగా అవడంతోనే మృతి చెందినట్లు వారంతా చెప్పారు. ఆస్పత్రికి తీసుకు రావడం ఆలస్యమైందని సూపరింటెండెంట్ వివరించారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: రహదారి భద్రత, ప్రమాదాల నివారణలో భాగంగా పలు పోలీసు స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్, హైవేలపై, ప్రధాన జంక్షన్ల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టి 'హెల్మెట్ ధారణ' పై అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించని వాహనదారులపై కేసులు నమోదు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 24 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, 452 కేసులు నమోదు చేసి, ఈ చలానాగా రూ.4,75,725/లను విధించామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామని తెలిపారు. రహదారి భద్రత నియమాలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వాహనదారులను ఎస్పీ హెచ్చరించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను మూడు సబ్ డివిజన్లలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యా రెడ్డి, చీపురుపల్లి డీఎస్పీఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు.

కోట్లు కొల్లగొడుతున్న కేటుగాళ్లు

- పట్టణ పరిధిలో జనవరి నుంచి రూ.కోటి మేరకు లూటీ
- సామాజిక మాధ్యమాల్లో లింకులతో ఎర
- ఇద్దరు ఉద్యోగుల నుంచి 94లక్షలు కాజేసిన నేరగాళ్లు

పార్వతీపురం రూరల్: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతూ కోట్ల రూపాయల డబ్బుపై అనేక రకాలుగా ఆశ చూపించి సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. ఒక్క పార్వతీపురానికి సంబంధించి గత జనవరిలోనే అక్షరాలా కోటి రూపాయలపై చిలుకు నగదును సైబర్ నేరగాళ్లు నాలుగు కేసులకు సంబంధించి కొల్లగొట్టారంటే ఏ స్థాయిలో సైబర్ వలలో ప్రజలు పడుతున్నారో తేటతెల్లమవుతుంది. ముందుగా సామాజిక మాధ్యమాల్లో గుర్తింపు ఉన్న బ్యాంకు నమూనాలతో లింకులు పంపించి అలాగే మతపరమైన లింకులు పంపించి ఆ లింకులు తెరిస్తే, తెరిచిన వారి వాట్సాప్, టెలిగ్రామ్ అకౌంట్లను ఆధీనంలోకి తెచ్చుకుని వారి కాంటాక్ట్‌లకు కూడా లింకులు పంపించి ప్రత్యేకంగా గ్రూపులు క్రియేట్ చేస్తూ ఈజీ రిటర్న్స్' ప్రామాణికంలో డబ్బులు వస్తాయని ఎర చూపుతున్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో ముగ్గురు, రూరల్ పరిధిలో ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసలు ఇటీవల కేసులు నమోదు చేశారు.

ఇద్దరు ఉద్యోగుల నుంచి రూ.96లక్షలు

పట్టణంలోని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ వలలో పడి ఏకంగా రూ.46లక్షలు పోగొట్టుకున్నారు. అలాగే ఓ మెడికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి దగ్గర నుంచి రూ.48లక్షలు ఆన్‌లైన్ ద్వారా దోచుకున్నారు. ఇంకా ఇటీవల పార్ట్ టైమ్ ఉద్యోగం, ఈజీ రిటర్న్స్ పేరిట ఓ మహిళ నుంచి రూ.4,30,000లు కాజేశారు. రూరల్ పరిధిలో ఏకంగా ఓ పోలీసు ఉద్యోగికి రూ.60వేలు ఆశ చూపించి దోచేశారు.



ట్యాక్స్ చెల్లిస్తే కోటి రూపాయలు వస్తుందని ఓ బాధితుడికి వచ్చిన సైబర్ నేరగాళ్ల మెసేజ్

అయితే ముందుగా గ్రూప్‌లో యాడ్‌అయిన అనంతరం కొంత మొత్తాన్ని పెట్టుబడిగా పెడితే అనతికాలంలోనే పెట్టుబడికి కలిపి మరికొంత డబ్బును ఖాతాలో జమచేసి ఎరవేస్తారు. అనంతరం లక్షల మేర డిపాజిట్లు చేస్తున్నప్పుడు ఆయా సాఫ్ట్‌వేర్‌లో బాధితులకు లక్షల రూపాయలు వచ్చినట్లు చూపిస్తూ ప్రస్తుతానికి బాధితుల ఖాతానుంచి తీయడం కుదరదంటూ మరికొంత డబ్బులను జమచేస్తేనే ఖాతాలో లక్షల రూపాయలు క్రెడిట్ అవుతాయని ఆశ చూపించి ఎరవేస్తారు. బాధితులు తమ వద్ద మరి డబ్బులు లేవని తెలిపే సమయానికి మొత్తం గ్రూపును డిలీట్‌చేస్తూ వారి అసలు రూపాన్ని చూపిస్తారు. ఈ తరహాలోనే మోసాలకు పాల్పడుతూ కోట్ల రూపాయలు కొల్ల గొడుతున్నారు.

అవగాహనతోనే అరికట్టవచ్చు



ఎప్పటికప్పుడు అనేక కార్యక్రమాల ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. అయినప్పటికీ ఉద్యోగులు, చదువుకున్న వ్యక్తులు ఈ విధంగా మోసాలకు గురవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసలు గుర్తుతెలియని వ్యక్తులు సులువు పద్ధతిలో డబ్బులు ఇస్తామని చెబితే ఎలా నమ్ముతున్నారో అర్థం కావడం లేదు. ఇప్పటికే జరిగిన కేసులకు సంబంధించి సైబర్ నేరగాళ్లు ఇతర రాష్ట్రాలైన బీహార్, రాజస్థాన్, తదితర రాష్ట్రాలకు చెందిన వారిగా ప్రాథమిక సమాచారం ఉంది. ఎస్పీ ఆదేశాలతో సామాజిక మాధ్యమాల్లో, బహిరంగ ప్రదేశాల్లో, కళాశాలల్లో, వివిధ కూడళ్లలో శాఖాపరంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు అవగాహన కలిగి ఉండి ఆన్‌లైన్ కాల్స్‌ను నిర్ధారించకుండా తమకు తెలిసిన వారని చెప్పినా అది నిజమో, అబద్ధమో నిర్ధారణ చేసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో ఆఫర్లు అంటూ, పార్ట్‌టైం ఉద్యోగాంటూ వచ్చిన లింకులను తెరవకూడదు.

– కె. మురళీధర్, పార్వతీపురం పట్టణ సీఐ

గిరిజన మత్స్యకారుడి గల్లంతు

- గజఈతగాళ్లతో గాలింపు
- లభ్యం కాని ఆచూకీ
- రోదిస్తున్న కుటుంబసభ్యులు



గల్లంతైన బాలరాజు



బాలరాజు భార్య, ఇద్దరు పిల్లలు



గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

పాచిపెంట: గిరిజన మత్స్యకారుల బతుకు చిత్రం ప్రతిక్షణం ప్రమాదకరంగా ఉంటోంది. వర్షాలు పడుతున్నా ప్రాణాలకు తెగించి వలవిసరక తప్పదు. లేకుంటే ఇంటిల్లిపాది పిల్లాపాపలతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి. వినాయక చవితి సందర్భంగా వర్షం కురుస్తోంది. జలాశయానికి నీటి ఉధృతి పెరుగుతుందని తెలుసు, కానీ పొట్టకూటి కోసం చేపలవేటకు వెళ్లిన పాచిపెంట మండలంలోని కోడికాళ్ల వలస గ్రామానికి చెందిన మత్స్యకారుడు పెద్ద గెడ్డ జలాశయంలో గల్లంతయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటికిపెంట పంచాయతీ, కోడికాళ్లవలస గ్రామానికి చెందిన జన్ని బాలరాజు(37) వత్తిరీత్యా పెద్దగడ జలాశయానికి చేపల వేటకు వెళ్తూ జీవనం సాగిస్తూ ఉంటాడు. రోజులాగానే బుధవారం ఉదయం పెద్దగెడ్డ జలాశయానికి చేపలవేటకు వెళ్లాడు. వల తీస్తున్న సమయంలో వరద ఉధృతికి నాటు పడవ బోల్తా పడడంతో జలాశయంలో గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీసులు అందుబాటులో ఉన్న గజ ఈతగాళ్లతో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే డ్రోన్ వినియోగించి గల్లంతైన వ్యక్తి కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. బాలరాజు గల్లంతైన వార్త విని కోడికాళ్లవలస గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు తీవ్రంగా రోదిస్తున్నారు. గల్లంతైన వ్యక్తికి భార్య జన్ని బుజ్జి, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

జారిపడి పెయింటర్ మృతి



చినరాము మృతదేహం

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్ కాలనీకి చెందిన బి.చినరాము (40) ప్రమాదవశాత్తు రెండతస్తుల బిల్డింగ్ పై నుంచి జారిపడి గురువారం అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణంలోని గూడ్ షెడ్‌రోడ్డులో నివాసం ఉంటున్న చినరాము పెయింటర్‌గా పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుంచి జారిపడి మృతిచెందినట్లు అందిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై గోవింద కేసు నమోదు చేశారు.

విద్యార్థుల కొట్లాటపై కేసు నమోదు

పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థులు నెలరోజుల క్రితం కళాశాలలో వాగ్వాదం జరిగి గొడవపడిన నేపథ్యంలో బుధవారం పట్టణంలోని నెహ్రూమార్కెట్ ఎదుట లస్సీ షాపు వద్ద మళ్లీ ఇరువర్గాలు పడిన ఘర్షణ కొట్లాటకు దారితీయడంతో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గోవింద తెలిపారు.

బాల్య వివాహాలు నేరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: బాలబాలికలకు 18 సంవత్సరాల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, రెండు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా ఉంటాయని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బాల్య వివాహాలపై ఆయన బాబా మెట్టలో గల కేంద్రియ విద్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక కారణాలవల్ల చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం సరైనది కాదన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల అనేక అనేక అనారోగ్య సమస్యలు, శారీరక సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. బాల్య వివాహాల రద్దు చట్టం గురించి బాల బాలికలకు అర్థమయ్యే రీతిలో తెలియజేశారు ఒకవేళ ఎవరైనా ఎక్కడైనా ఎప్పుడైనా బాల్య వివాహం జరిగినట్లు లేదా చేస్తున్నట్లు తెలియవస్తే వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 1098కు లేదా జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి తెలియజేయవలసిందిగా కోరారు. ఇప్పటికీ అనేకచోట్ల బాల్యవివాహాలు ఇంకా నమోదవుతున్నాయన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన నివేదికల ఆధారంగా హైకోర్టు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రతి గ్రామం, విద్యాసంస్థల్లో బాల్యవివాహాల నిషేధం పట్ల అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యవంతులను చేయాలన్నారు. అవగాహన సదస్సులో కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ, బెజ్జిపురం యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఝాన్సీలక్ష్మి అధిక సంఖ్యలో బాల, బాలికలు పాల్గొన్నారు.

మిక్సీ వైరుతో భార్యను హత్యచేసిన భర్త

సాలూరు: మద్యానికి బానిసైన భర్త తాగడానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో భార్యను హత్యచేశాడు. పట్టణంలో జరిగిన ఈ సంఘటనపై సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని దుర్గానవీధిలో తాపిమేస్త్రి రామకృష్ణ, త్రివేణి(38)లు నివాసముంటున్నారు.మద్యానికి బానిసైన రామకృష్ణ భార్య త్రివేణిని బుధవారం డబ్బులు అడగ్గా ఆమె నిరాకరించడంతో కోపంతో రగిలిపోయి ఇంటిలో ఉన్న మిక్సీ వైరును త్రివేణి మెడకు చుట్టి హత్యకు పాల్పడ్డాడు. తన తల్లిని తన తండ్రి హత్యచేశాడని మృతురాలి కుమారుడు ఆదిత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని చెప్పారు.

పారా జాతీయ స్థాయి పోటీలకు పయనం



జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ వేదికగా ఈనెల 29 నుంచి 31 వరకు జరుగబోయే 15 వ పారా జూనియర్, సబ్ జూనియర్స్ జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్-2025 పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి క్రీడాకారులు పయనమయ్యారు. వాంరందరికీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 13 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. గతం కంటే ఈసారి దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరువుతున్నారని, జాతీయస్థాయి పోటీలలోనూ బాగా రాణించి క్రీడల్లో జిల్లా కీర్తి, ప్రతిష్ఠలు మరింతగా పెంచాలని పిలుపునిచ్చారు.

పెన్సిల్‌తో ఆకర్షణీయంగా కలెక్టర్ చిత్రం



పెన్సిల్‌తో వేసిన కలెక్టర్ చిత్రాన్ని అందిస్తున్న డ్రాయింగ్ టీచర్ శ్రీనివాసరావు

పార్వతీపురం: పార్వతీపురంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నతపాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న రుగడ శ్రీనివాసరావు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ చిత్రాన్ని పెన్సిల్‌తోవేసి తన ప్రతిభను కనబరిచి కలెక్టర్ నుంచి ప్రశంసలు అందుకున్నాడు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ చిత్రాన్ని పెన్సిల్‌తో ఆయన ఆకర్షణీయంగా చిత్రీకరించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను కలిసి పెన్సిల్‌తో వేసిన చిత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పెన్సిల్‌తో వేసిన చిత్రాన్ని చూసిన కలెక్టర్, శ్రీనివాసరావును ప్రత్యేకంగా అభినందించారు. గరుగుబిల్లి మండలం, రావివలస గ్రామానికి చెందిన శ్రీనివాసరావు చిన్నతనం నుంచి చిత్రాలు వేసి ఈప్రాంతీయుల అభిమానాన్ని చొరగొంటున్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం



తవుడు (ఫైల్)

కొత్తవలస: ఈ నెల 26న మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామం సమీపంలోని చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొని ఎస్‌కోట సీహెచ్‌సీకి తరలించిన విషయం తెలిసిందే. కాగా ప్రధాన ప్రతికల్లో వచ్చిన కథనాలు, ఫొటోలను మృతుడి భార్య, కుమారుడు గుర్తించి పోలీసులను సంప్రదించారు. ఈ మేరకు చెరువులో కలువ పూలకోసం దిగి మృతి చెందిన వ్యక్తిని శ్రీకాకుళం జిల్లా బాతువ గ్రామానికి చెందిన అలుగోలు తవుడు(48)గా గుర్తించారు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు, సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి బతుకు తెరువు కోసం కొత్తవలస సమీపంలో గల కుమ్మరిబంజరి ప్రాంతానికి అలుగోలు తవుడు కుటుంబసభ్యులు వచ్చారు. టైలరింగ్, కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. తవుడికి మద్యం తాగే అలవాటు ఉంది. సమీపంలో గల ఆటో డ్రైవర్, మరో వ్యక్తితో కలిసి తరచూ మద్యం తాగేవాడు. ఈ క్రమంలో వారు ముగ్గురూ ఈ నెల 25న మద్యం తాగి కొత్తసుంకరపాలెం గ్రామం సమీపంలో గల చెరువులో గల కలువ పువ్వులను ఏరి వినాయక చవితికి అమ్ముకుందామన్న ఉద్దేశంతో ఆటోలో వెళ్లారు. చెరువులోకి దిగిన తవుడికి లోతు తెలియక చాలా సేపు కనిపించక పోవడంతో ఆయనతో పాటు వెళ్లిన ఆటో డ్రైవర్, మరో వ్యక్తి అక్కడినుంచి పారిపోయారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తొమ్మిది ఎకరాల జొన్న పంట ధ్వంసం

- లబోదిబో మంటున్న రైతులు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు



ధ్వంసమైన జొన్న పంట వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామానికి చెందిన చిప్పాడ గౌరునాయుడు, గరుగుబిల్లి శంకరరావులకు చెందిన తొమ్మిది ఎకరాల్లోని జొన్న, పత్తి పంటలను ఇటీవల కోటిపాం పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు మంగళవారం అర్ధరాత్రి ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చిన సమయంలో ఇలా నాశనం అయితే మేము ఏం చేయాలో అర్థం కావడం లేదుని ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో దిక్కు లేదుంటూ లబోదిబో మంటున్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. 2018లో వచ్చిన ఏనుగుల గుంపు వేలాది ఎకరాల్లో పంటనష్టంతో పాటు ప్రాణనష్టం జరుగుతున్నటికీ ప్రభుత్వం తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటోంది. కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగులను తీసుకువచ్చి అడవి ఏనుగులను తరలించే ప్రకియ చేపడతామని మాటలు చెబుతోందే కానీ కనీసం పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు, రైతులు వాపోతున్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

డెంకాడ: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని, కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని లెండి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో హ్యాకథాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. లెండి కళాశాల ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ-2005 సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, విద్యార్థులను ఉద్దేశించి కాసేపు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నేర్చే ప్రతి అంశం క్షుణ్ణంగా నేర్చుకుని, భవిష్యత్‌లో అభివృద్ధి చెందేందుకు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అచ్యుతకుమారి

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నందున తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి పి.అచ్యుతకుమారి సూచించారు. మండలంలోని తీర ప్రాంతాలైన కోనాడ, బొడ్డుగురయ్యపేట, తిప్పలవలస, మత్స్యవానిపాలెం గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి, ఆయా గ్రామాల్లోని వైద్య శిబిరాలను సందర్శించారు. అనంతరం తుపాను సహాయక చర్యలపై ఆరాతీశారు. ప్రజలకు వైద్యారోగ్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, ఎవరైనా జ్వర లక్షణాలతో బాధపడితే వారికి వెంటనే వైద్యం అందేలా చూడాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టి, జనానికి పరిశుభ్రమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి, సాధారణ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి నుంచి పూసపాటిరేగ పీహెచ్‌సీకి వెళ్లి, వైద్య సిబ్బంది పనితీరు, మందుల నిల్వలు, కుక్క, పాముకాటుల వ్యాక్సిన్లు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ఆమె వెంట వైద్యాధికారి ప్రమీలాదేవి ఉన్నారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి



విజయనగరం అర్బన్: పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా కోరారు. జిల్లాలోని అదే యూనివర్సిటీలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సుస్థిర పర్యాటకం-ఉపాధి అవకాశాలకు మూలం అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల వర్క్‌షాపును గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగలు, జాతరలు, తిరునాళ్లు వంటి సామూహిక వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాపులో భాగంగా పట్టణంలోని సహజ పరిసరాలను విద్యార్థులు సందర్శించి, ప్రజలను కలిసి పర్యావరణకు వారు పాటుపడేలా చైతన్యం చేయాలన్నారు. అలాగే సంప్రదాయ కళలు, హస్తకళల రక్షణను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ దీపక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమసింగిలో జాబ్‌మేళా

జామి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, భీమసింగి బాలాజీ డిగ్రీ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో భీమసింగి బాలాజీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ అధికారి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళాకు 17 బహుళజాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తాయని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదైనా పీజీలో ఉత్తీర్ణత సాధించి 18నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు ఉదయం 9గంటలకు బాలాజీ కళాశాలకు హాజరుకావాలని కోరారు.

పండగ విషాదం

యువకుడి దుర్మరణం

- బైక్‌ను లారీ ఢీకొనడంతో ప్రమాదం
- వినాయక ఉత్సవాలకు వచ్చి అనంతలోకాలకు
- గుండెలవిసేలా రోదిస్తున్న తల్లిదండ్రులు



బాలాజీ మృతదేహం



రోదిస్తున్న తల్లి, బంధువులు

రామభద్రపురం: పండగ పూట బొబ్బిలి మండలం పారాది గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తగరపువలసలోని దివిస్ ఫార్మా కంపెనీలో చిరుఉద్యోగం చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటూ వినాయక ఉత్సవాలకు గ్రామానికి వచ్చిన ఒక్కగానొక్క కొడుకును లారీ రూపంలో మృత్యువు కబళించడంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా ఉంది. ప్రమాదంలో దుర్మరణం చెంది రోడ్డు పక్కన పడి ఉన్న కొడుకును చూసి ఆతల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని బొబ్బిలి స్మార్ట్ సిటీ సమీపంలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో యువకుడు పువ్వల బాలాజీ(21) మృతిచెందాడు. బొబ్బిలి మండలంలోని పారాది గ్రామానికి చెందిన బాలాజీ తన ద్విచక్రవాహనంపై వినాయక చవితి పండగ పనుల నిమిత్తం రామభద్రపురం వస్తున్నాడు. సరిగ్గా స్మార్ట్ సిటీ సమీపంలోకి వచ్చిన సమయానికి రామభద్రపురం నుంచి బొబ్బిలి వైపు ఎదురుగా వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో బాలాజీ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న ఎస్సై వి.ప్రసాదరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, లారీని స్వాధీనం చేసుకున్నారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి..



సత్యనారాయణ(ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: (45) రైల్వే ట్రాక్ మెయింటనెన్స్ నాలుగవ తరగతి ఉద్యోగి, మండలంలోని సింగనాపురం పంచాయతీ తుమ్మల దత్తవలస గ్రామానికి చెందిన బంకపల్లి సత్యనారాయణ రైలు ఢీకొని మృతి చెందాడు. ఈనెల 26న కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే బైపాస్ లైన్ క్యాబిన్ వద్ద విధులు నిర్వహిస్తుండగా ఆ సమయంలో వస్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన గతంలో మిలట్రీలో పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్నారు. దుర్ఘటన అనంతరం మృతుని కుటుంబానికి సమాచారం అందించి మృతదేహానికి పెద్దాపురం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బుధవారం ఆయన స్వగ్రామమైన తుమ్మల దత్తవలసకు రైల్వేసిబ్బంది తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సంధ్యారాణి, కుమారుడు నాని, కుమార్తె శశితో పాటు తండ్రి బంకపల్లి రాములు, తల్లి రేగాలమ్మ ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. కుటుంబ పెద్ద సత్యనారాయణ మృతితో కుటుంబమంతా తీవ్ర మనస్థాపానికి గురైంది.

కుక్కల దాడిలో ఎనిమిది గొర్రె పిల్లల మృతి



మృతిచెందిన గొర్రెలు

వంగర: మండల పరిధి తలగాం గ్రామంలో వీధి కుక్కలు దాడి చేయడంతో ఎనిమిది గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన గురువారం వేకువజామున జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పడాల రాము తనకున్న గొర్రెలను బుధవారం రాత్రి పశువుల శాలలో ఉంచాడు. వాటిపై కుక్కలు దాడి చేయడంతో అక్కడికక్కడే ఎనిమది గొర్రెలు మృతిచెందాయి. నిరుపేద కుటుంబానికి చెందిన రామును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెట్టును బస్సు ఢీ కొని ఒకరు..



బస్సులో శ్రీను మృతదేహం

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై మరిపివలస జంక్షన్ వద్ద రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఆర్టీసీబస్సు ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 13 మంది గాయాల పాలయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో సీతానగరం మీదుగా రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరిపివలస జంక్షన్ వద్ద ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సుకు ఎడమ భాగాన సీట్లో కూర్చున్న బొబ్బిలి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎ.శ్రీను (41) మృతి చెందగా బస్సులో ఉన్న 13 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను పార్వతీపురం లోని ప్రైవేట్, ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై రాజేష్ మాట్లాడుతూ శ్రీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలియజేశారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి..



దాడిబాబు (ఫైల్)

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధి యాతవీధిలో నివాసముంటున్న గొంప దాడిబాబు(27) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దీనిపై ఎస్సై ఎల్. రమేష్ తెలియజేసిన వివరాల ప్రకారం బుధవారం ఇంటి పక్కనే ఉన్న పూరిపాకలో నిద్రించాడని, దాడిబాబు ఇంటి నుంచి పాకలో ఉన్న ఫ్యాన్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వగా ఆ వైరు అక్కడక్కడా తెగి ఉండడంతో ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించామని తెలిపారు.మృతుడు దాడిబాబుకు భార్య రాధ ఉంది.

పాము కాటుతో వ్యక్తి..



తిరుపతి (ఫైల్)

కొమరాడ: మండలంలోని గంగరేగువలస గ్రామానికి చెందిన దాసరి తిరుపతి(50) పాము కాటుతో మృతి చెందాడు. బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం చేసుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో రహదారిపై తిరుపతిని పాము కాటు వేసింది. దీంతో గ్రామస్తులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణం విడిచాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.